

రాజీ

కృష్ణ

"మానవజన్మ ఎంతో ఉత్కృష్టమైనది.

ఎంతోపుణ్యం చేసుకున్న జీవికిగాని యీ జన్మ లభించదు. అందుకే నరజన్మ మిక దుర్లభమురా....." గుడిలో చెబుతూన్న హరికథకుడి మాటలు చెవిన బడగానే నవ్వొచ్చింది సోమయాజులుకి. అబద్ధం— మోసం— దగా అనుకున్నాడు. పాపం చేసుకున్న జీవులే మానవులుగా పుడతారంటే సమంజసంగా వుంటుంది. లేకపోతే పుణ్యం చేసుకున్న జీవులు ధనికమానవులుగా పుడతారంటే సముచితంగా వుంటుంది. ధనమూలమైన యీ జగత్తులో పేదవాడుగా పుట్టడమంటే— అన్ని రకాల శిక్షలూ వేసినట్లే. అన్ని శిక్షల మూర్తీకృత రూపమే నరజన్మ గాదూ—?

దేవాలయం దాటి వొచ్చేశాడు—హరిదాసు గొంతు విన్పిస్తూనే వుందిగాని మాటలు విపులంగా విన్పించడంలేదు.

ఇంతకీ వెతనుదుక్కుంటూ వెళ్తున్న కిషన్‌లాల్ యీ వేళప్పుడు యింట్లో వుంటాడో లేదో? సాధారణంగా గురువారాలు రాఘవేంద్రస్వామి సంకీర్తనకి, శనివారంనాడు ఆంజనేయస్వామి గుడికి భజనకూ, సోమవారం శివాలయానికి వెళ్తుంటాడీ వేళప్పుడు. వేరే వారంనాడు గుడికి వెళ్ళడని గాదు—కానీ యింట్లో వుండే అవకాశం వుంది.

వాళ్ళింటిముందే నిల్చుని వున్నాడు కిషన్‌లాల్ ఎప్పటిలాగే చిరునవ్వు మాయని ముఖంతో—అయిదుగురు పిల్లలు— తనలాగే చిన్న వుద్యోగం కానీ ఆ

మొహాన చిరునవ్వుని మాయనివ్వడు- ఎప్పుడూ సుభ్రంగా వుతికి రానీపాల్ వేసిన తెల్లని షర్టులా ఆ చిరునవ్వుని మాత్రం తొడుక్కునే వుంటాడు.

తనని చూడగానే సోఫాదిగి రెండు చేతులూ జోడించి - "నమస్కారం సోమయాజులుగారూ-రండి రండి-యిటు యిటు-" అంటూ ఆ బురద [illegible]ందుకు బాధపడుతూ జాగ్రత్తగా యింట్లోకి తోడ్కొని పోయినాడు.

వీళ్ళిద్దరినీ చూడగానే ఆ గదిలో వున్న శ్రీమతి కిషన్‌లాలూ, పిల్లలూ చప్పున లేచి రెండో గదిలోకి వెళ్ళిపోయినారు.

పడక కుర్చీ సోమయాజులుకు చూపి తను మడత కుర్చీ వాల్చి కూర్చుని చేతులు రాసుకుంటూ "చెప్పండి- ఎలాంటి సేవ చేయగల్గుతాను తమకోసం?" అన్నాడు ఆవు నెయ్యిలాంటి హిందీలో.

గిల్టీగా నవ్వేడు సోమయాజులు- "ఏముందీ- మామూలు యాచనే- మా పెద్దాడు మొన్న బి.కాం. పాసైనాడు- మీకు తెలుసుగా- పేపర్లో ఉద్యోగ ప్రకటన వొకటి పడింది. అప్లికేషన్‌ఫాం ఇరవై రూపాయలు - మరో పదిరూపాయల పోస్టల్ ఆర్డరు- ఈ మధ్యాహ్నం దాకా ఎక్కడేనా దొరుకుతాయేమోనని చూశాను. ఎల్లుండే చివరి తేదీ- మిమ్మల్ని ఇబ్బంది పెట్టక తప్పడంలేదు-"

చిరునవ్వుతో సోమయాజులు వంక చూస్తూనే వున్నాడు కిషన్‌లాల్, ఆయన మాటలకి 'ముగ్ధుడై' పోయినవాడిలా.

ఆ చూపు చూసి సోమయాజులే విస్తుపోయి ఆ తరువాత దిక్కుతోచక ముఖం చిట్లించి ప్రశ్నార్థకం చేసి- "క్షమించాలి- మీకూ నెలాఖరు రోజులే- నాకు తెలీకనా! కానీ యేం చెయ్యాలో దిక్కుతోచని పరిస్థితిలో యిదిగో నా కాళ్ళట్లాగే లాక్కొచ్చి పడేసేయి మీ యింట్లో-" అంటూ నేరం కాళ్ళమీదకి తోసేసి నిట్టూర్చేడు.

నవ్వేడు సోమయాజులు మాటలకి కిషన్‌లాల్- "ఎంతవసరం పడ్తుందంటారు చెప్పండి?"

"ఎంతోనా! ఏభై రూపాయలు- ఏదో మీ చేతిమీదుగా యీ సర్దుబాటు జరిగితే మావాడికా వుద్యోగం దొరుకుతుందేమోనని-" అతుకుల చిరునవ్వుని తొడిగేడు సోమయాజులు.

"అట్లాగే-" తలూపేడు కిషన్‌లాల్. అంతకన్నా ముఖ్యమైన విషయాన్ని ప్రస్తావించేడు "నిన్న పారాయణకి వొస్తారేమోనని చాలా ఎదురుచూశాను మందిర్‌లో-"

రామాలయంలో జరిగే రామచరిత మానస్ పారాయణానికి కిషన్‌లాల్ కోసమన్నట్లుగా ఎప్పుడో ఒకసారి వెళ్తుం

టాడు సోమయాజులు. తనకి హిందీయే సరిగా రాదు. అందులోనూ అదేదో బ్రిజ్ భాష అట - వెళ్ళినప్పుడు అందర్తోబాటు పెదాలు కదిలించి- ఆ తరువాత చిత్తం ఏమరపాటులో వుండినందుకు రాములవారి విగ్రహం ముందు చెంపలు వాయించుకుని యింటికి వొచ్చేస్తుంటాడు.

"నిన్న మీరు వచ్చుండాల్సింది- ఆ వనాంతర భూములనెంత గొప్పగా వర్ణించేడు గోస్వామీజీ!" అంటూండగానే కిషన్‌లాల్ కళ్ళు చెమర్చినట్లు అన్పించి బెదురు బెదురుగా చూశాడు సోమయాజులు.

ఆ మందిరాలూ - ఆ భజనలూ - ఆ పారాయణాలూ- ఈ కిషన్‌లాలూ- యీ పారవశ్యం- యీ స్పందనా! ఏమిటో అర్థమై యేడవదు సోమయాజులుకి. మళ్ళీ కులం చూస్తే- సాక్షాత్తూ ఆ ప్రవహనకై వాలి అవతారం అన్పిస్తూంటుంది. తమూ మరి! రావడమైతే తనకూ మంత్రపుష్పం వొచ్చు - విష్ణు సహస్రనామం, కృష్ణకర్ణామృతం, కరావలంబస్తోత్రం, ముకుందమాల వగయిరాలు వొచ్చు. కానీ యే ఆలయంలో నిలచినా, యే మూర్తి ముందు చేతులు జోడించినా ప్రతి శ్లోకం- ప్రతిపాదం కాగానే 'మావాడి కుద్యోగం కావాలి స్వామీ' అనీ, 'నా ప్రమోషను సంగతి కాస్త చూడు స్వామీ' అనీ, 'చిన్నాడు పొత్తిగా అకతాయిలా తిరుగుతున్నాడు స్వామీ- కాస్త వాణ్ణి సరైన మార్గంలోకి మళ్ళించు స్వామీ' అనీ- అకుపూజలో ఒక్కో- అకూ విసిరినట్లు ఒక్కో- నివేదనా స్వామివారి పాదాల మీదికి మృదువుగా విసుర్తుంటాడు తను.

లోపల్నించి పిలుపు- కిషన్‌లాల్ టీ పట్టుకొచ్చేడు.

ఏభై రూపాయిలు జేబులో వేసుకుని యింటికి నడుస్తున్నాడు సోమయాజులు- కిషన్‌లాలూ తనలా చిన్న వుద్యోగే- తన కుటుంబం కంటె పెద్దది అతని కుటుంబం-కాకపోతే యింటద్దె తనకంటే తక్కువ అతనికి- పెళ్ళాం- బిడ్డా కుట్టు మిషన్ పనిచేస్తారు. విస్తళ్ళు కుడుతుంది వాళ్ళమ్మ. ఆ సంపాదన బాగానే వుంటొచ్చు. అందుకేనేమో 'సమస్య' అంటే యేమిటో తెలివివాడినా కన్పిస్తాడు. నిరంతరం చిన్మయముద్రలో వుంటాడు.

తాత్కాలికంగా అవసరం తీరింది సోమయాజులుకి- పెద్దాడు అప్లికేషన్ యిచ్చేశాడు

దరఖాస్తు పంపిన దగ్గర్నించీ-ఇంటర్వ్యూ ఎప్పుడుంటుందో! సిఫారసులు పడుస్తాయేమో-! ఎవరికేనా చెయ్యి తడపాల్సిన అవసరం పడ్తుందేమో! ఒకవేళ అట్లాంటి అవసరం వస్తే-? అని పరిపరివిధాల ఆలోచనలు.

ఇట్లా ఆలోచనల్లో సతమతమౌతుంటే కిషన్‌లాల్ బలవంతంగా రామ మందిరానికి తీసుకుపోయినాడు.

ఆ గంటన్నర సేపూ పారాయణంలో కూర్చున్నాడు సోమయాజులు అంత సేపూ తన చూపు లెక్కడున్నయ్యో! చిత్త మెక్కడుందో. చేతిలో చిటితాళం యేం చేస్తోందో - ఆ భజనలో నోరేం పల్లించిందో యేమీ తెలవదు అతనికి.

"ఇవాళ మీరు చాల ప్రశాంత చిత్తంతో అధ్యాత్మిక చిత్తవృత్తిలో వున్నారు. చుట్టుపక్కల దేన్నీ పట్టించుకోనంత సంపూర్ణంగా భజనలో లీనమైపోయి నారు. మీరు పారాయణానికి క్రమం తప్పకుండా వస్తే బాగుంటుంది. ఆ కొంత సేపయినా యీ ఐహిక లంపటం నుంచి బయటపడతాము...." అని కిషన్‌లాల్ అంటే—

"అఁ—నా బొంద...." అనుకున్నాడు సోమయాజులు- 'మీ మొహం' అని అనుకున్నాడేమో గూడా. చుట్టుపక్కల వాళ్ళవైపు గూడా చూశాడు—"ఏమోనండి నాకైతే దేవాలయానికి వెళ్ళినప్పుడే సమస్తమైన సమస్యలూ లిస్టు చదువు తున్నట్లు జ్ఞాపకం వొస్తాయి. ఇంట్లో యేదయినా సమస్య వచ్చినప్పుడుమాత్రం ఆ భగవంతుడు గుర్తొస్తాడు. అందుకని యింట్లోవుంటేనే ఆ భగవంతుణ్ని తలచు కున్నట్లుంటుందనీ—" అన్నాడు సోమ యాజులు.

ప్రశాంత వదనంతో చిరునవ్వు నవ్వేడు కిషన్‌లాల్— "చమత్కారంగా మాట్లాడంలో మాత్రం మీకు మీరే సాటి సోమయాజులుగారూ—!"

"అఁ" అని చప్పరించి యిందాకటిదే మళ్ళీ అనుకున్నాడు సోమయాజులు- కిషన్‌లాల్ చాల అదృష్టవంతుడు - తన లాగా కాదు. వరసగా ముగ్గురు మగ పిల్లలు- అదీ ఎలాంటి వరసనీ! ఏడాది గడవగానే పెద్దాడి బట్టలు రెండోవాడికీ, రెండోవాడివి మూడోవాడికి సరిపోయేలా కుటుంబాన్ని ప్లాన్ చేసుకున్నాడు. నాలుగూ అయిదు క్లాసులకి యింకా బట్టల అవసరం పడుతున్నట్లు లేదు- స్కూలు పుస్తకాలూ అంతే.... పెద్దాడు పైక్లాసుకు పోగానే వాడవి రెండోవాడికి, రెండో వాడివి మూడోవాడికి- అంతేకాదు కిషన్ లాల్ కట్టే ఆ నెతవుతుక్కవ లుంగీలు చూపినప్పుడల్లా యింకో అనుమానమూ వస్తోంది తనకి. సరే ఆ తలుపు కర్టెన్ అయితే ఖచ్చితంగా కిషన్‌లాల్ లోగడ కట్టిన లుంగీయేనని తనకి తెలియనే తెలుసు.

తనూ అట్లా కుటుంబాన్ని ప్లాన్ చేసుకోలేకపోయినా కనీసం యింటి ఖర్చులన్నా అట్లా ప్లాన్ చేసుకోవచ్చుగదా

అవ్వించి ఆ సాయంత్రమే శ్రీమతితో తనకు లుంగీల ఏర్పాటు గురించీ వీధి తలుపు కర్టెన్ విషయమూ మాట్లాడాలని నిర్ణయించుకుంటే బాగుంటుందేమో నన్పించింది సోమయాజులుకు.

ఆ మున్నాడే పెద్దాడికి వచ్చిన యింట ర్వ్యూ పిలుపు చూడగానే ఉద్యోగం రావడానికి అన్ని యేర్పాట్లూ జరుగుతూ న్నట్లనిపించింది.

సరిగ్గా యింకో వారం రోజులకే యింటర్వ్యూ- సిటీకి వెళ్ళి ఏదేనా ప్రయ త్నం చేస్తే బాగుంటుం దన్పించింది- దరఖాస్తు పెట్టి పోస్టలార్డరు పంపి యింట ర్వ్యూ పిలుపు వచ్చిన తరువాత గూడా యేమీ ప్రయత్నం చెయ్యకుండా వుండట మంటే 'యీనగాచి నక్కలపాలుచెయ్య డమే కాదూ-' అనుకోగూడదు గనీ-

ఇట్లాంటి విషయాల్లో తనకు సల హాలూ సదుపదేశాలూ చేసే ఏకైక మిత్రుడు కిషన్‌లాలే- అందుకే ఆ పిలుపు జాబు తీసుకుని నేరుగా అతని దగ్గరకే వెళ్లాడు.

కిషన్‌లాల్ పిల్లలు నాలుగు- అయిదు గాత్రీలు అనుకుంటున్నారు- చూసి అతని బిడ్డల ప్లానింగ్ విషయంలో తానను కున్నది నిజమే కావడంతో సంతృప్తి చెందేడు సోమయాజులు.

ఇంతలో ప్రత్యక్షమై రెండుచేతులూ జోడించి- "నమస్కారం ప్రియమిత్రు లకు-" అన్నాడు కిషన్‌లాల్ హిందీలో- "ఎలా సేవించగల్గుతాను మిమ్మల్ని!"

తనకూ అట్లా ఘుమఘుమలాడే హిందీలోనే మాట్లాడాలన్పించి- "అచ్ఛా- సేవానహీఁ మేరా ముఝ్ నహీఁ తుమ్హారా సల్హా కా వాస్తే అయాహూఁ తేరీ అంగ్ నేమే-" అన్నాడు సోమయాజులు.

ఇంట్లోకి తీస్కెళ్ళాడు కిషన్‌లాల్. శ్రీమతి కిషన్‌లాలూ పిల్లలూ చప్పున లేచి వంటగదిలోకి పోయినారు.

పడక్కుర్చీలో తనూ, మడతకుర్చీలో కిషన్‌లాలూ కూర్చున్నాక సంగతిచెప్పేడు సోమయాజులు.

ఇంటర్వ్యూ పిలుపు చూశాడు కిషన్ లాల్. ఆ తరువాత కళ్ళజోడు తీసి ఒక చేత్తోపట్టుకుని మరోచేతి బొటన-మధ్య- చూపుడు వ్రేళ్ళు కనురెప్పలపై వుంచి ధ్యానమగ్నుడిలా వుండిపోయినాడు- తరువాత మామూలు భంగిమలోకి వచ్చి "నాకొక ఆలోచన కల్పిస్తున్నాడారాముడు సోమయాజులుగారూ- మరి మీకు అది ఆమోదయోగ్యంగా అన్పిస్తుందో లేదో గాని-" అని ఆగిపోయినారు.

"అయ్యయ్యో- అంతకంటేనా- చెప్పండి చెప్పండి- ఏ పుట్టలో ఏ పాముందో!"

ఆ పాముని కాస్తా బైటికి లాగేడు కిషన్‌లాల్- "మా వాళ్ళకి తెలిసిన పోలి



టీషియనొకాయనన్నాడు— ఇట్లాంటి పైరవీలంటే ఆయనకి కొట్టిన పిండి—కాకపోతే—" విద్యుత్ప్రవహరా ఆగిపోయినట్లు ఆగిపోయినాడు.

"కొంచెం వెయ్యి తడపాల్సుంటుండి—బౌనా—" వ్యవధి తీసుకోకుండానే పూర్తి చేశాడు సోమయాజులు— "ఎందాకా పోవచ్చునంటారు?"

"అహఁహఁ— నాకు జ్ఞాపకం వొచ్చిన సంగతి చెప్పేను— మా కాలనీలో నలుగురైదురికి ఆయన అనుగ్రహంతోటే వుద్యోగాలు దొరికినయ్. ఆ సంగతి మాత్రం నే నెరుగుదును—పోతే వివరాలూ అంటే నాకు తెలియదు—"

కిషన్‌లాల్ చేతుల్ని తన రెండు చేతుల్లోకి తీస్కున్నాడు సోమయాజులు.

"బాబ్బాబు— మీరు నా గురించి వెళ్ళొద్దురూ— అవేవో వివరాలు కనుక్కొచ్చేరంటే ఎక్కడేనా తల తాకట్టుపెట్టేనా సర్దుకోవచ్చు—"

"అట్లాగే" అన్నాడు కిషన్‌లాల్.

అన్నందుకు హైదరాబాదు వెళ్లొచ్చేడు—వివరాలన్నీ సేకరించుకు వచ్చేడు.

ఉద్యోగం స్కేలు ప్రకారం చూస్తే మొదటిజీతం పన్నెండొందలకి తక్కువగాదు. ఇటువంటి కేసుల్లో సాధారణంగా అతగాడు ఏడెనిమిది వేలదాకా తీసుకుంటాడు— అయితే కిషన్‌లాలూ అతని బంధువులూ చొరవతీసుకుని కొంచెం కనికరం చూపించాల్సిన కేసు అని చెప్ప

దంతో ఏడువేలకి దిగేడు.

"నాలుగువేలు మొదటే చేతిలో పెట్టాల్స్ వుంటుంది. మిగతావి అర్ధరు చేతికందిన నెలరోజుల్లో నెమ్మదిగా సర్దొచ్చు గానీ నమ్మకంగా—" అన్నాడు కిషన్‌లాల్.

ఎంత స్నేహితుడైతేనేం ఆ వార్తతో ఒక్కసారిగా సోమయాజులుముఖంలోని నెత్తుటినంతా పిండేశాడు కిషన్‌లాల్.

స్నేహితుడిచ్చిన మంచినీటి గ్లాసందుకున్నాడు సోమయాజులు— ముఖాన చల్లుకోవాలో— గొంతు తడుపుకోవాలో— చేత్తో వొదలాలో క్షణం తోచలేదు తెప్పరిల్లుకుని మొత్తల్లాకా వెళ్ళి కాస్త ముఖాన చిలకరించుకొని మిగతావి తాగేశాడు.

మర్నాడే భార్య మెళ్ళో నానుతాడూ, తనచేతికున్న వెంకటేశ్వరస్వామి వుంగరమూ అమ్మాయికి చేయించిన ఒంటిపేట గొలుసూ— బాంక్‌లో పెట్టి "బంగారం అప్పు" మూడువేలూ జీతంరాగానే నూటికి మూడురూపాయల వడ్డీతో యిస్తానని పన్నెండొందలూ పోగుచేసి కిషన్‌లాల్— చేతికిచ్చాడు.

ఇబ్బంది ముఖం పెట్టేడు కిషన్‌లాల్. "ఇది డబ్బుతో కూడిన వ్యవహారం సోమయాజులుగారూ.మీరూ స్వయంగా వొస్తే బాగుంటుంది—అంతా సక్రమంగా నడిస్తే మనిద్దరికీ ఆనందమేననుకోండి— అహం కిడెంచి మేలెంచమంటారు గదా— కాబట్టి మీరేవొస్తే బాగుంటుంది— వెంట నేనూ వుంటాను—"

సోమయాజులు కండ్లు టపటపలాడించి అన్నాడు— "ఈనాడు మీకంటే నాకు ఆప్తులెవరూ లేరు— యీ డబ్బు ఎట్లా అమరిందో మీకు తెలుసు—ఇహ కీడూ—మేలూ అంటారా— మా ప్రాప్తం ఎట్లా వుంటే అట్లా జరుగుతుంది. ఈ పని మీ చేతుల మీదుగా జరుగుతుందని నాకో విశ్వాసం కుదిరింది ఈ కాస్త శ్రమా మీరే తీసుకోవాలి—"

ఇక కిషన్‌లాల్ రెట్టించలేదు. స్నేహపూర్వకంగా సోమయాజులు చేతిని నొక్కి— "అ రా ము ది యిచ్ఛ—!" అన్నాడు.

"మన ప్రయత్నం మనం చేస్తున్నాం— ఆపైన ఆ ఏడుకొండలవాడి దయ!" అన్నాడు సోమయాజులు.

ఆ శ్రీరాముడికీ— ఏడుకొండల దేవుడికీ పరస్పర పరిచయం వుందో లేదో గాని మిత్రులిద్దరు కలిసి వారిద్దరికీ సంయుక్తంగా యీ బాధ్యతను కట్టబెట్టేరు.

కిషన్‌లాల్ ఆ రోజే బయల్దేరి హైదరాబాదుకు వెళ్ళేడు.

మర్నాడు అతను పటీనుంచి వొచ్చే లోగా సోమయాజులు గుండెల్లో పాసెంజర్లూ, గూడ్సులూ, ఎక్స్‌ప్రెస్‌లూ ఎన్ని

పరిగెత్తాయో లెక్కలేదు. ఆ రైళ్ళన్నీ ఆయన శ్రీమతి, పెద్దబ్బాయీ, పెద్ద మ్మాయీ మొదలైన స్టేషన్లన్నింటిలోనూ ఆగినయ్.

వస్తూ వస్తూ కిషన్‌లాల్ రానున్న వుద్యోగపు బియానాలాగా బాంబేహల్వా తెచ్చేడు.

ముందుగా ఆ స్వీటులోంచి ఓముక్క తీసి కిషన్‌లాల్ నోటిని తియ్యబరచి— "మీ ఋణం ఎలా తీర్చుకోగలను— వచ్చే జన్మలో మీ కడుపున పుడ్తాను—"అన్నాడు సోమయాజులు.

శ్రీమతి కాన్పులప్పుడు పడ్డ యాతన గుర్తొచ్చింది కిషన్‌లాల్‌కి — ఎంత కృతజ్ఞతవున్నా సోమయాజులు ముచ్చట తీర్చడం తనవల్లనైతే కాదనుకున్నాడు— వచ్చే జన్మలోగానీ— ఆటావల జన్మలో గానీ.

నాటినుంచి మూడోరోజున యింట ర్వ్యూకి వెళ్ళవచ్చేడు శ్రీనివాసు.

అభ్యర్థులందరిలో ఎక్కువసేపు తననే యింటర్వ్యూ చేయడమూ—వాళ్ళ కఠినమైన ప్రశ్నలడగటమూ— వాటన్నిం టికీ తను టకటక సమాధానం చెప్పడమూ ఇంటర్వ్యూగదిలోంచి బైటికి వస్తుండగా చాలామంది అభ్యర్థుల ముఖాన అసంతృప్తిని తను కనిపెట్టడమూ— వివరించేడు శ్రీనివాసు.

సోమయాజులు గుండె ఎక్స్‌ప్రెస్ వెళ్ళిపోయిన ప్లాట్‌ఫాంలా తేలికబడ్డది కానీ ఎక్కడో ఓ మూల వుద్యోగం గురించిన సందేహం 'ఔటర్' మలుపు దగ్గర యింజన్‌లా కన్పిస్తూండే చెట్ల గుంపులో వుండిపోయింది.

ఇంతలో సోమయాజులు చిన్న కొడుకు వొచ్చి తండ్రిఎదుట నిల్చున్నాడు.

"ఏం బాబూ - నువ్వింకా కాలేజీకి వెళ్ళలేదూ— టైం కాలేదూ?" అన్నాడు కిషన్‌లాల్—

కిషన్‌లాల్‌కు తల వూపుతో సమా ధానం చెప్పి అన్నాగు చిన్నాడు— "డాడీ నాకో రెండొందలు కావాలి—"

ఆ ఆశ్చర్యంలో ముఖం చిట్లించడం మరచిపోయాడు సోమయాజులు— "రెండొందలా?—"

"ఔను—" దృఢంగా సమాధానం వచ్చింది—"రెండొందలు సరిపోతయ్యేవి గాదు— కనీసంగానే— మా కాలేజీ ఎన్ని కల్లో నేను సెక్రటరీగా పోటీ చేస్తున్నాను.

ఇప్పుడు ముఖం చిట్లించేడు సోమ యాజులు— "మతిగాని పోయిందేవిట్రా నీకు— మొదటి సంవత్సరంలో రెండు సబ్జక్ట్స్ పోయినయ్— ఇప్పుడేమో ఎల క్షన్లో నిల్చుంటా నంటావా? ఎలక్షన్లు, పిలక్షన్లు మనకేమీ అక్కర్లేదు. ఇప్పటి

కైనా బుద్ధితెచ్చుకుని కాస్త చదువుమీద ధ్యాస నిలుపు-చదువుకపోతే ఎందుకూ పనికిరాం మనం-" అని ఒకటి రెండు మంచి ఉదాహరణలు గూడా చెప్పా లన్పించి అన్నాడు- "ఆ ఎదురింటి శంక రయ్యగారి అమ్మాయి చూడు-ప్రతి క్లాసు లోనూ- ప్రతి సబ్జక్టులోనూ-"

కిషన్‌లాల్ నవ్వు విని ఆపి యిటు చూసేడు సోమయాజులు.

చిన్నాడు ఎదురుగా లేడు-

ఆశ్చర్యంలోంచి రెండు క్షణాల క్రితమే చిరుకోపంలోకి వచ్చేడా సోమ యాజులు పాపం! కాస్తయినా తెరపి లేకుండానే వెంటనే నిస్పృహలోకి వెళ్ళి పోవాల్సొచ్చింది- "అయ్యా- బాబూ- ఇదిగో చూశారుగా- వీణ్ణి గురించే నాకు పుట్టెడు దిగులు- ఆ మెట్రిక్ ఏదో తక్కువ మార్కులతో మిడిసేడు. ఇంటర్ మొదటేడువి రెండు సబ్జక్టులలాగే వుండి పోయినయ్. అస్తమానమూ ఓ పదిహేను యిరవైమంది గాంగు వీడివెంట- నెల వొచ్చిందంటే పొద్దున పోతాడు దీపాలు పెట్టేక వస్తాడు- లేకపోతే క్రికెట్టం టాడు. ఇదిగో యిప్పుడేమో ఎలక్షన్లో పోటీ చేస్తాట్ట- నా లక్షం చేదనుకోండి- తల్లేమైనా అంటే తిండి మానేస్తాడు-"

చాలసేపట్నుంచి తన డైలాగుకోసం ఎదురుచూస్తున్న పాత్రధారిలా - "వ్వ- చిన్నతనంలెండి-" అన్నాడు కిషన్‌లాల్.

రోజులు గడచిన- ఒకటి- రెండు- నాలుగు- అయిదు- వారం అయింది యింటర్వ్యూ గడచి-

ఆలోచనలు పరుగెత్తినయ్ సోమయాజులు మనసులో. చూస్తూ చూస్తూ నాలుగువేలు సమర్పయామి చేసుకున్నాడు తను. మరి ఆ వుద్యోగం వొస్తుందో మొరాయిస్తుందో?

మళ్ళీ గూడ్సులూ. ఎక్స్‌ప్రెస్‌లూ, రైళ్ళురాక యథావిధిగా మొదలైంది సోమయాజులు గుండెల్లో.

"ఇంట్లో యే ఖర్చు కావాలన్నా పైసాకిపైసా లెక్కలు దీస్తారు నాలుగు వేల రూపాయిలు తీసుకుపోయి వాడెవడో వల్లకాట్లో రామరుద్రాయి మొహాన కొట్టేరు-" అంటూ సాధించటం మొద లెట్టింది శ్రీమతి.

నాలుగు రోజులింకా హడలగొట్టి, ఉద్రిక్తతలో పెట్టినాక నవ్వుతూ ఓ మధ్యాహ్నం వచ్చింది సెలెక్షనూ- ఆర్డరూ.

ఈ నాలుగు రోజుల్లో పరిపరివిధాల ఆలోచించినందుకు, చెంపలు వాయించు కున్నాడు సోమయాజులు.

తనుగూడా టపాటపా చపేటాలతో దండం పెట్టింది ఆయన శ్రీమతి.

శ్రీనివాసు ఆ సాయంత్రం ముఖం

రెండుసార్లు రుద్ది- తల మూడుసార్లు దువ్వి - నాలుగుసార్లద్దంలో చూసుకుని మరీ బైలుదేరేడు బజారుకి.

చిన్నవాడు మాత్రం తండ్రిపట్ల నిష్ఠురాన్ని చూపుల్తోనే వీలైనంత స్పష్టంగా తెలియజేస్తున్నాడు.

ఆదివారంనాడు కిషన్‌లాల్‌ని వెంట తీసుకుని బయలుదేరేడు సోమయాజులు అపద్బాంధవుడిలా వొచ్చి వుద్యోగం యిప్పించిన పెద్దమనిషికి కృతజ్ఞతలు తెలియజేసుకోడానికి.

"ఆ గిరిగారు కావడానికి వయసులో మనకంటే కొంచెం చిన్నవాడే అయుండొచ్చు కానీ—అబ్బ ఎంత నిదానస్తుడండీ మనిషి! చెప్పిందంతా వోపిగ్గా వింటాడు— ఫలానరోజున రండి అని మీతో అన్నాడంటే ఆ రోజున మీరు వెళ్ళగానే ముందాయనే పేరుతో పలకరిస్తాడు— ఒకసారి చూశాడంటే యిహ ఆ మనిషిని మరచిపోడనుకోండి—" రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో కూర్చున్నాక చెప్ప సాగేడు కిషన్‌లాల్.

"ఇంతకీ ఆయనేంచేస్తున్నారు కిషన్‌లాల్‌జీ?"

"అయ్యో—సోమయాజులుగారూ—ఏమైనా చెయ్యాల్సిన అవసరం ఆయనకేముందండీ, ఒకటర్మ ఎమ్మెల్యేగా వున్నాడు— మునిపల్ కౌన్సిలర్‌గా వున్నాడు— మా నగర్‌వాళ్ళేకాదు సిటీలో ఎక్కడెక్కడి వాళ్ళో పనులు చేయించి పెట్టమని ఆయన దగ్గరకొస్తుంటారు. ఉదయం ఆరింటికల్లా స్నానం పూజా ముగించుకుని సిద్ధంగా వుంటాడాయన విజిటర్స్‌కోసం. తొమ్మిది— తొమ్మిదిన్నర దాటిందంటే రాత్రి పదింటిదాకా దొరకడు మనిషి—"

"ఇంతకీ— యివ్వాళ మనకి దొరుకుతాడంటారా?"

"దొరుకుతాడులెండి—ఇవ్వాళాదివారం కదా— ఆఫీసులన్నింటికి సెలవేనాయె—"

బేగంపేటలో దిగి సికింద్రాబాదులోని గిరిగారింటికి వెళ్ళేసరికి తొమ్మిదైంది.

గిరిగారింట్లోనే వున్నారు.

అయిదారుగురు విజిటర్స్‌రూంలోంచి అప్పుడే బైటికి వెళ్ళిపోవడంతో తనూ యింట్లోకి వెళ్ళబోతూ వీళ్ళని చూసి ఆగిపోయినాడు.

చూడగానే గుర్తుబట్టి— "రా—కిషన్ లాల్—రా నీకాందేటుపని అయింది గదా?" అన్నాడాయనే.

"చిత్తం—చిత్తం— అయిపోయిందండీ తమకి కృతజ్ఞతలు తెలియజేసుకోడానికి వచ్చామండి— వీరు కాండేటు తండ్రి—"

మళ్ళీ వోసారి నమస్కరించి తను తెచ్చిన నేతిమిఠాయి ప్యాకెట్టు గిరిగారి చేతిలో వుంచేడు సోమయాజులు— మీ మేలు మరచిపోలేను— మా యింట్లో అందరిమంచీ మీకు కృతజ్ఞతాభివందనాలు— దయవుంచండి—"

నవ్వుతూ తలూపేడు గానీ అన్యమనస్కంగా సోమయాజులు ముఖంకేసే చూస్తూ వుండిపోయినాడు గిరిగారు. కొన్నిక్షణాలు పోయినాక— "తమపేరేంటన్నారు?" అన్నాడు.

"సోమయాజులండీ— నేను కాండూరు పంచాయతీ సమితిలో యూ. వో. గా పనిచేస్తున్నాను.

'ఔ'నన్నట్లు సాత్యంగా తలూపేడు కిషన్‌లాల్.

గిరిగారిచూపు యింకా అదే ధోరణిలో వుంది- "సోమయాజులుగారు గదూ? ఔనౌను- తమరు కేశవ్ మెమోరియల్ స్కూల్లో చదివేరు గదూ?"

చకితుడైనాడు సోమయాజులు. ఎక్కణ్నుంచో కొత్త ప్రాణం శరీరంలోకి ప్రవహిస్తున్నట్లనిపించింది సోమయాజులుకు- "చిత్రంచిత్రం- ఔనండీ" అన్నాడు సంతోషంతో.

అప్పటిదాకా నిల్చునే వున్నారు.

"కూర్చోండి - కూర్చోండి-" అని కూర్చోబెట్టి రెండు క్షణాలు యింట్లోకి వెళ్ళొచ్చి తన టేబిల్ విడిచి సోమయాజులు ప్రక్కనున్న కుర్చీలో కూర్చుని- "నేను మీకంటే మూడు సంవత్సరాలు జూనియర్ని- పండిత్ రావ్ సాబ్ హెచ్చెమ్ వుండె అప్పుడు-" అన్నాడు గిరిగారు.

కొంచెం ప్రాణం లేచొచ్చింది సోమయాజులకు- "అలాగా- చాల సంతోషం- చాల సంతోషం-"

"మీరు చిక్కడపల్లిలో వుంటుంట్రి గదా- మీరున్న యింటెదురుగ ఒక పాత పెంకుటిల్లు వుండె- యాదున్నదా? మా నాయినగారు వజీర్‌సుల్తాన్‌ల పని జేస్తుండేవాడు. అదేయింట్ల వుంటు నేను మా యన్నా కేశవ్ మెమోరియల్ స్కూల్లో చదువుకుంటూంటిమి- మా యన్న పేరు తిరుపతయ్య-"

ముప్పైయేండ్ల క్రితం-చిక్కడ్‌పల్లి- తను అద్దెకున్న ఆ యిల్లూ- ఎదురుగా పాతబడ్డ ఆ పెంకుటిల్లూ- ఆ యింట్లోవి తనకంటే ఒకే సంవత్సరం జూనియరైన తిరుపతయ్యా- ఆ బొమ్మలన్నీ సినిమా వేసినట్లు గిర్రున సోమయాజులు స్మృతి పథాన తిరిగినయ్.

"గుర్తుకొస్తూంది- తిరుపతయ్య- యేం చేస్తున్నాడిప్పుడు-?"

"ఫౌజులో జేరికొన్నాడ్నండి వచ్చినాక యిప్పుడు సెక్యూరిటీ ఆఫీసరుగా వున్నాడు వజీర్‌సుల్తాన్‌లనే-"

"మీ- చెల్లెళ్ళు వాళ్ళు- మీ నాయన గారు?"

"మా నాయన కాలంజేసి యిరువై సంవత్సరాలు దాటింది- మా చెల్లెండ్లిద్దర్నీ నేనే పెండ్లిండ్లు జేసిన- ఒకాయనకి కంట్రాక్టు లిప్పించిన- యింకొకాయనతో దుకనం బెట్టించిన- మాయమ్మగారుగూడ నా దగ్గర్నే వుండె. సంవత్సరమైంది కాలంజేసి- నేను మెట్రిక్‌తోటె చదువాపేసి పియాసత్‌ల దిగితిని- ఒక టర్ము ఎమ్మెల్యే జేసినాను- కొన్నాళ్ళు మునిసిపాల్టి కౌన్సిలర్‌గ వున్న-"

సోమయాజులు మనస్సు ముందుకూ వెనక్కూ తిరుగుతూ బొమ్మల్ని చూస్తోంది. ఆ పాత పెంకుటిల్లూ- పాగాకు కంపెనీలో పనిచేస్తూ రోజూ సాయంత్రం తాగి యింటికొచ్చి ఒక దృశ్యాన్ని చూపించే ఆ పెద్దమనిషి- చింపితలలతో చిరిగిన పరికిణీలతో తిరుగాడిన ఆ ఆడపిల్లలు- స్కూల్లో లీడరుగిరీ వెలుగబెట్టిన తిరుపతయ్యా- చిరిగినగుడ్డల్తో జులాయి తిరుగుడు తిరుగుతూ గిల్లీ దండు ఆడుతూ అప్పుడు స్కూలుకొస్తూండిన యీ గిరి-యాదగిరీ- కదిలేబొమ్మల్లా గుర్తుకొస్తున్నారు.

"లోపలికి రా- యిల్లు జూపిస్త-" అని స్నేహంగా చెయ్యిబట్టి లేపి తీసుకు పోయినాడు గిరిగారు సోమయాజుల్ని.

భార్య- పిల్లల్ని పరిచయం చేశాడు. ఖరీదైన ఆ డైనింగ్‌టేబుల్‌మీద తనతో బాటు కూర్చోబెట్టుకుని ఉపాహారం తినిపించేడు.

అనుకోని యీ పరిణామానికి కలిగిన విస్మయంనుండి తేరుకో యత్నిస్తున్నాడు కిషన్‌లాల్.

"మీరు నాకు బాగా యాద్-" మళ్ళీ వచ్చికూర్చున్నాక మొదలెశాడు గిరిగారు. ఆయన కండ్లల్లో జ్ఞాపకాల మెరుపు కన్పిస్తోంది "డిబేట్ల- ఎస్సెరైటింగ్‌ల ఎప్పుడూ మీరే ఫస్టొచ్చేటి. ఒకసారి హిందూమతం లోపాలిని గురించి ఎవరో విమర్శచేస్తే- ఆయన తిలావ్‌ల మీరు బెహ్‌త్రీన్ జవాబు చెప్పింటిరి- మీకు యాదుండకుండొచ్చుగాని నాక కనాబాగ యాదుంది-"

ఎందుకనో సోమయాజులు కండ్లు మసకబారినయ్ ఎక్కడి స్కూలు నాటి తను- ఎక్కడి యీనాటి తను-!! తనకు తనకే పోలిక కనబట్టంలేదు, మన సంస్కృతి- మన సాహిత్యం- మన సంప్రదాయం అంటూ జబ్బలు చరచుకుని- వాటికి స్వయం నియమిత ప్రతినిధిగా, సంరక్షకుడిగా, వ్యాఖ్యాతగా వుండిన ఆనాటి తనని- యీ జీవితం- దుర్వ్యాఖ్యమైన యీ జీవితం- ఎట్లా ముక్కుతాడువేసి బరబరా ఎక్కడికో లాక్కుపోయి ఎందులోనో పడేసి- తన అభినివేశపు నడ్డి విరగొట్టి, అభిరుచి చెంపలు వాయించి, అభిప్రాయాల్ని ఆలోచనల్ని అవసరాల బరువుకింద అణగదొక్కి, 'మనో జీవితం'లోని మాధుర్యాన్ని పీల్చేసి, అనురక్తిని తుష్కంచేసి....

అలసిన మనసుతో బలహీనంగా నవ్వేడు సోమయాజులు 'ఔ'నన్నట్లు.

గిరిగారు- యాదగిరి- యింకా జ్ఞాపకాల పూటనుంచి సోమయాజులు ప్రతిధని మాటల్లోకి తోడుతూనే వున్నాడు.

ఆ తరువాత ఉన్నట్లుండి సోమయాజులు చేయి పట్టుకుని ఒక్కణ్నే అవతలి గదిలోకి తీసుకుపోయి అడిగేడు గిరిగారు– "ఈ పైరవీ గురించి ఎంత యిచ్చుంటిరి తమరు?"

విస్తుపోయినాడు సోమయాజులు– చెప్పాలో వొద్దో తెలీలేదు– ఇందులో తనకి తెలీని మెలికలేమైనా వున్నాయేమో నని సందేహించేడు. అయినా గిరిగారు వయాన్నే బలవంత పెట్టడంతో చెప్పక తప్పలేదు.

కాసేపటికి మళ్ళీ వో కప్పు టీ వచ్చింది.

మళ్ళీ మళ్ళీ ఆయనకి కృతజ్ఞతలు చెప్పి బయలుదేరేడు సోమయాజులు

లోనుంచి సంచి వొకటి తెచ్చి యిచ్చేడు గిరి– నిమ్మపండ్లూ– కరివేపాకూ– అరటికాయలూ– తమలపాకులూ నింపి– "ఇది బాకీకి యిచ్చి వమస్తే చెప్పండి– ఎప్పుడైన సిటీకివొస్తే తీసుకురాండి– ఏమైన పని అవసరంబడైతే రాండి–"

జీవితంలో ఏ పరిణామం, ఎట్లా, ఎంత అనూహ్యంగా వస్తుందో– మళ్ళీ వొసారి తెలియవచ్చింది సోమయాజులుకు.

ఇంటికి వొచ్చేకాడు సోమయాజులు ఆ సాయంత్రమే. కిషన్‌లాల్ పని వుందని సిటీలో వుండిపోయినాడు.

"అతనెవరోకాదు– నా చిన్ననాటి స్నేహితుడి తమ్ముడే– పరిచయస్తుడే. అతనే గుర్తుబట్టేడు నన్ను– ఎంత స్నేహంగా మాట్లాడేడో!" అంటూ భార్యకు చెప్పుకుపోయినాడు సోమయాజులు వివరాలన్నీ.

వింటూ సంచిలోని ఆకులూ కాయల్ని సర్దుతూన్నదల్లా విస్తుపోతూ – "ఇదేంటండీ?" అన్నది శ్రీమతి సోమయాజులు.

జేబురుమాల్లో చుట్టిన ఆ కవరు చూసి విస్మయచకితుడైనాడు సోమయాజులు.

తీసి చూశాడు– సరిగ్గా నాలుగువేలూ వున్నయ్. ఇది మిత్రుడు గిరి చేసిన పనే అని తెలిసిపోతోనేవుండి– 'అయ్యో!' అనుకున్నాడు– తను సరాసరి అతని దగ్గరకు వెళ్ళి మొహమాటంలో పెట్టిన తైంది అన్పించింది.

"నిజంగా స్నేహితులంటే అట్లా వుంటారు చూడండి– పాపం ఎన్నేళ్ళ క్రిందట స్నేహమో. ఎంత గుర్తుంచుకున్నాడో!" అంది శ్రీమతి సోమయాజులు కన్నీళ్ళతో.

ఇంతట్లో యింటిముందు కలవరం విన్పించింది సోమయాజులుకు– బైటికి వెళ్ళి చూసేలోపున్నే చిన్నాడు లోపలికి వచ్చేడు.

అటు చూసిన సోమయాజులుకు వాకిట్లో యిరవై ముప్పైమంది- చిన్నారి మిత్రుల సమూహం కన్పించింది.

ముద్దాయిలా తలవొంచుకు నిల్చుని "డాడీ- మా ఫ్రెండ్సంతా వచ్చేరు- నేను సెక్రటరీగా పోటీచేసి తీరాలంటున్నారు-"

చిన్నారి వంక చూసింది తల్లి- ఆపై సాలోచనగా భర్తకేసి చూసి అంది- "పోనీండి వాడంతగా ముచ్చటపడు తున్నాడు- స్నేహితులంతా కావా లంటున్నారేమో- నిలబడ్తే నిలబడ్నీండి- ప్రపంచంలో ఎక్కడా ఎన్నికలు జరగడంలేదా- ఎవరూ నిలబడటంలేదా- పోటీ చెయ్యడం లేదా!"

మౌనంగా నిల్చుండిపోయినాడు సోమయాజులు. చేతిలో ఆ కవరు అట్లాగే వుంది.

అతని మనస్సులో ఆ క్షణాన ఎన్ని దృశ్యాలు మెదిలేయో- ఎన్ని అభిప్రాయాలు సంఘర్షించాయో- కరగి పోయిన తన స్వప్నాలెన్ని జ్ఞాపకం వచ్చేయో- జరగనున్న ఘటన ఎట్లా గోచరించిందో తెలీదు.

తండ్రిని ఆ స్థితిలో చూస్తూ ఆలోచనలో పడిపోయిన చిన్నాణ్ని చూసి "నువ్వెందుకురా అట్లా పిచ్చాడిలా చూస్తూ నిలబడ్తావు! వెళ్ళు- నిలబడ్తే నిలబడుదూగానిలే- మీ నాన్నతో నే చెప్తాలే. కాపీ తగాదాలు, పోట్లాటలూ మాత్రం తెచ్చుకోకండి నాయనా-" అన్నది శ్రీమతి సోమయాజులు.

అతికష్టంమీద ఆపుచుకున్నాడు సోమయాజులు 'అకారణం'గా పొంగుకొస్తూన్న కన్నీటిని.